వారధి నిర్మాణ పనుల్లో జాప్యం

- గోదావరి కాలువపై నిర్మాణానికి ఏడాది క్రితం శ్రీకారం
- వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.4 కోట్లు మంజూరు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ముందుకు సాగని నిర్మాణ పనులు
- శాశ్వత వంతెన కోసం ఎదురు చూస్తున్న ప్రజలు



గుండుగొలను వద్ద తాత్కాలిక వంతెన బోల్టులు ఊడిపోయి బలహీన పడిన ఇనుప రేకులు

భీమడోలు: గుండుగొలను వద్ద గోదావరి కాలువపై కొల్లేరు గ్రామాలకు ఉపయోగపడే విధంగా నిర్మించ తలపెట్టిన వారధి నిర్మాణం ఇప్పట్లో పూర్తయ్యేలా లేదు. నిర్మాణం పూర్తి కావాలంటే కాలువ కొన్ని రోజుల పాటు మూసి వేస్తేనే తప్ప పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. ఇది జలవనరుల శాఖ ఉన్నతాధికారుల నిర్ణయంపై ముడిపడి ఉంది. వారి నుంచి స్పష్టత లేనందున పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీని ఫలితంగా పనులు చేపట్టి ఏడాదిపైగా కావస్తున్నా నేటికీ పనులు ఎక్కడ వేసిన గొంగళిగా మారాయి. మొదటి నుంచి సంబంధిత ఇరిగేషన్ ఉన్నతాధికారులు, నేషనల్ హైవే కాంట్రాక్టర్లు సమన్వయం లోపించడంతో వారధి నిర్మాణం మరింత జాప్యానికి కారణంగా తెలుస్తోంది. దీనితో వంతెన నిర్మాణంపై నీలినీడలు అలముకున్నాయి. ఇప్పటికే వంతెనపై నిలువుగా ఆర్‌సీసీ గడ్డర్లు నిర్మించి సిద్ధంగా ఉన్నా బిగించే పనులు నిలిచిపోయాయి. నెలలు తరబడి పనులు నిలిచిపోవడంతో వంతెన నిర్మాణానికి వినియోగించే ఇనుప ఊచలు తుప్పు పట్టిపోతున్నాయి. దీనితో గడ్డర్లు దెబ్బతినే అవకాశం ఉంది.

రెండేళ్ల క్రితం కూలిన బ్రిటిష్ కాలం నాటి వంతెన

బ్రిటిష్ కాలం నాడు గుండుగొలను వద్ద నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి రెండేళ్ల క్రితం కూలిపోయింది. దీనితో నిత్యం రద్దీగా ఉండే ఈ వంతెనపై ఒక్కసారిగా రాకపోకలు స్తంభించిపోయాయి. భీమడోలు, దెందులూరు, ఏలూరు రూరల్, కైకలూరు ప్రాంతాలకు వెళ్లి వచ్చే వేలాది మంది ప్రజలు, రైతులు, భక్తులు, విద్యార్థులు ప్రయాణానికి అవస్థలు పడ్డారు. దీనితో అప్పటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు తక్షణమే ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గోదావరి కాలువపై 2022 నవంబర్‌లో బెయిలీ వంతెనను ఆగమేఘాలపై నిర్మించారు. దీంతో పాటు విజయవాడ నుంచి గుండుగొలను జాతీయ రహదారి నిర్మాణ సంస్థకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ నుంచి రూ.4 కోట్ల నిధులను మంజూరు చేయించారు. 2023 జూన్‌లో కూలిన వంతెన వారధి స్థానంలో నూతన నిర్మాణానికి నేషనల్ హైవే కాంట్రాక్ట్ సంస్థ పనులు ప్రారంభించింది. అయితే గోదావరి కాలువ ద్వారా గుండుగొలను శివారు దెందులూరు, ఏలూరు రూరల్ మండలాలకు సాగునీరు, తాగునీటి అవసరాలకు నీటి ప్రవాహం కొనసాగుతున్నందున ఆది నుంచి ఈ పనులకు ఆటంకంగా మారింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలోనే 60శాతం పనులు పూర్తయ్యాయి. ఆర్‌సీసీ గడ్డర్లను నిర్మించారు. ఆ గడ్డర్లను పిల్లర్లపై బిగించే పనులు సాగడం లేదు. తప్పనిసరిగా కాలువలో నీటి ప్రవాహాన్ని నిలుపుదల చేస్తేనే ఈ పనులు సాగుతాయని సంబంధిత కాంట్రాక్టర్ చెబుతున్నాడు. దీనిపై జలవనరుల శాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి వంతెన నిర్మాణానికి ఆటంకాలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బెయిలీ వంతెనపై భయం.. భయంగా ప్రయాణం

గుండుగొలనువద్ద వంతెన కూలిపోవడంతో శాశ్వత వంతెన నిర్మాణం పూర్తయ్యేంత వరకు గోదావరి కాలువపై బెయిలీ వంతెనను నిర్మించి ప్రజల రాకపోకల కష్టాలు తీర్చారు. బెయిలీ వంతెన నిర్మాణ ప్రారంభోత్సవంలో ఈ వంతెన కాల వ్యవధి రెండేళ్లే అని రోడ్లు భవనాల శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. మరో నెలలో దీని గడువు తీరిపోనుంది. అయితే బెయిలీ వంతెనపై అధిక లోడు వాహనాల రాకపోకలు సాగించడంతో రేకులకు బిగించిన బోల్టులు ఊడిపోయి బ్రిడ్జి బలహీన పడుతోంది. దీనితో వంతెనపై వాహనదారుల ప్రయాణం భయం భయంగా సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో వంతెనపై వేసిన రేకులు పాడైపోయిన తక్షణమే స్థానిక వైఎస్సార్‌సీపీ ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు వాటిని మరమ్మతులు చేయించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు ప్రస్తుతం కనిపించడంలేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు వంతెనకు తాత్కాలిక మరమ్మతుల చేసేందుకు ముందుకు రావడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు శాశ్వత వంతెన నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

త్వరలో గడ్డర్ల బిగింపు పనుల ప్రారంభం



గుండుగొలను వంతెనపై గడ్డర్లు బిగించే పనులు పదిరోజుల్లో ప్రారంభం కానున్నాయి. కాలువ కింద భారీ పైపులు ఏర్పాటు చేసుకుని వంతెన నిర్మాణ పనులు చేపట్టేందుకు అనుమతులు ఇవ్వాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులు, ఇరిగేషన్ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దీనికి ఇరిగేషన్ అధికారులు అంగీకరించారు. గోదావరి కాలువ నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా కింద మూడు మీటర్ల భారీ పైపులను ఏర్పాటు చేస్తారు. దీనితో గడ్డర్లు ఏర్పాటు పనులు సులభంగా పూర్తయ్యి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

– పి.సుబ్రహ్మణ్యం, జలవనరుల శాఖ ఏఈ, గుండుగొలను సెక్షన్



గుండుగొలను వద్ద నిర్మాణంలో ఉన్న వంతెన ఇనుప ఊచలు తుప్పుపడుతున్న దృశ్యం



వంతెన పైన ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేసిన సిమెంట్ గడ్డర్లు

క్లుప్తంగా

పరిమి సత్యనారాయణకు రైతు నేస్తం పురస్కారం



రైతు నేస్తం పురస్కారాన్ని అందుకుంటున్న పరిమి సత్యనారాయణ దంపతులు

ఉంగుటూరు: మండలానికి చెందిన రైతు పరిమి సత్యనారాయణ రైతు నేస్తం పురస్కారాన్ని అందుకున్నారు. కృష్ణా జిల్లా ఆత్కూర్‌లోని స్వర్ణ భారతి ట్రస్ట్‌లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా పరిమి సత్యనారాయణ దంపతులు ఈ పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మండల ప్రముఖులు సత్యనారాయణను అభినందించారు.

పోతునూరులో జ్వరాలపై సర్వే



జ్వరాలపై సర్వే చేసి మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: పోతునూరు పీహెచ్‌సీ పరిధిలో ఇంటింటా జ్వరాలు, ఒళ్లునొప్పులు, ఇతర అనారోగ్యాలపై సర్వే చేయిస్తున్నామని పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. కొత్తూరు, పోతునూరులో సర్వే నిర్వహించి జ్వరాలు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న వారికి వైద్య సిబ్బంది మందులను అందించారు. ఇళ్లకు వస్తున్న వైద్య సిబ్బందికి సహకరించాలని వైద్యాధికారి కోరారు.

రేపు కండ్రిగనర్సింహపురంలో రెవెన్యూ సభ

దెందులూరు: కండ్రికనర్సింహపురం పంచాయతీలో ఈ నెల 22న రెవెన్యూ గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు దెందులూరు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని తెలిపారు. ముప్పవరం, కండ్రికనర్సింహపురం గ్రామ శివారు ప్రాంతాల ప్రజలు, రైతులు భూ సంబంధిత సమస్యలపై ఆధారాలతో రెవెన్యూ సభకు వచ్చి సమస్యలపై వినతిపత్రాలు అందజేయాలని కోరారు.

రేపటి నుంచి ఆధార్ నమోదు శిబిరాలు

గణపవరం: గణపవరం మండలంలో ఆధార్ నమోదు, అప్‌డేషన్ కోసం నాలుగురోజుల పాటు ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి తెలిపారు. ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకూ ఈ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. 22వ తేదీన గణపవరం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ఎ.గోపవరం గ్రామ సచివాలయం వద్ద, అర్ధవరం జెడ్పీ ఉన్నత పాఠశాల, పిప్పర ఉన్నత పాఠశాల, మొయ్యేరు సచివాలయం, 23వ తేదీన బాలికల ఉన్నత పాఠశాల, కాశిపాడు ఉన్నత పాఠశాల, జల్లికొమ్మర సచివాలయం, పిప్పర-2 సచివాలయం, ముప్పర్తిపాడు సచివాలయం వద్ద, 24వ తేదీ గణపవరం-2 సచివాలయం, వల్లూరు సచివాలయం, కొత్తపల్లి సచివాలయం, డికుముదవల్లి, కేశవరం జెడ్పీ ఉన్నత పాఠశాలల వద్ద, 25న గణపవరం-4 సచివాలయం, ఎస్.కొండేపాడు సచివాలయం, సరిపల్లె సచివాలయం, చిలకంపాడు, అప్పనపేట సచివాలయాల వద్ద ఆధార్ అప్‌డేషన్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

22న సత్యనారాయణపురంలో..

దెందులూరు: దెందులూరు పంచాయతీ సత్యనారాయణపురంలో ఈ నెల 22న ఆధార్ నమోదు శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ కే.శ్రీదేవి తెలిపారు. దెందులూరు పంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేయనున్న ఆధార్ శిబిరాన్ని శివారు ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు ఆధార్ శిబిరం ఏర్పాటు సమాచారంపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఆమె సూచించారు.

ఆర్‌సీఎం చర్చి సమాజ సేవలు అభినందనీయం

పెదవేగి : విజయరాయి గ్రామంలోని ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రార్థన మందిర భవనానికి ఆదివారం ఉదయం నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పాల్గొని కార్యక్రమ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన, దైవ ప్రార్థన మనిషికి మానసిక ప్రశాంతతను అందజేస్తాయని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వంటివి కలిగినప్పుడు ప్రజలకు నిత్యావసరాలు వంటివి అందించి సహాయం చేయటం, అలాగే గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు విద్యను చేరువ చేయటం సహా అనేక అంశాల్లో ఆర్‌సీఎం సంస్థ తమ సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆర్‌సీఎం సంఘ పెద్దలను, సభ్యులను, మత గురువులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ సంతురాజ ఎస్వీడీ, ఫాదర్ బాల, ఫాదర్ బాబు జార్జ్, ఫాదర్ బెన్ని ఎస్వీడి సహా పలువురు మత గురువులు, కూటమి నాయకులు, పలువురు మత విశ్వాసులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే సర్వతోముఖాభివృద్ధి



చిన్నారులకు పుస్తక పఠనం ఆవశ్యకతను వివరిస్తున్న మండే సుధాకర్

భీమడోలు: పుస్తక పఠనం విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలులో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు పాల్గొని సామూహిక పుస్తకం పఠనం చేశారు. చిన్నారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో గ్రంథపాలకుడు డీఎన్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, గ్రామ పెద్దలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ ఊరేగింపు



పూలరథంపై ఊరేగుతున్న కనకదుర్గమ్మ

గణపవరం: గణపవరం వాటర్ ట్యాంకు వద్ద నిర్వహించిన విజయ దశమి నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఈసందర్భంగా అమ్మవారిని గ్రామంలో భారీగా ఊరేగించారు. పూలతో అలంకరించిన ట్రాక్టర్‌పై అమ్మవారిని ఉంచి గ్రామంలో వీధివీధినా ఊరేగించారు. బ్యాండు మేళాలు, కోయడ్యాన్సులు, తీన్‌మార్ వాయిద్యాలు, బాణసంచా మోతలు, విచిత్ర వేషాలు, శక్తి వేషాలతో అమ్మవారిని గ్రామంలో వీధుల్లో ఊరేగించారు. చినరామచంద్రపురం, ఇందిరమ్మ కాలనీ, తోట, సలాదివారి వీధిలో ఏర్పాటుచేసిన దసరా నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి.

పోలీసు అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం
- పోలీసుల ఆధ్వర్యంలో వారం రోజుల పాటు పలు కార్యక్రమాల నిర్వహణ



పోలీసు అమరవీరుల స్థూపం (నమూనా)



అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు (ఫైల్)

దెందులూరు: కష్టమొచ్చిన ప్రతి ఒక్కరికీ వెంటనే ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసులు. విధి నిర్వహణలో భాగంగా అనేకమంది పోలీసులు అమరులవుతున్నారు. అమరులైన పోలీసుల త్యాగాలను ఎన్నటికీ మరువలేము. వారి త్యాగాలను స్మరించుకోవడం అందరి బాధ్యత. నేర పరిశోధన, ప్రజల సంరక్షణలో పోలీసు సేవలు అజరామరం. పోలీసులు తమ కుటుంబాన్ని, వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసి దేశంలోని కోట్లాది మంది ప్రజల రక్షణకు, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో భాగంగా తమ జీవితాలను అంకితం చేస్తారు. అక్టోబర్ 21 నుంచి వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం, ర్యాలీలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పోలీసుల స్ఫూర్తిదాయకమైన సేవలను స్మరించుకుని ఘన నివాళులర్పిద్దాం..

అమరవీరులకు ఘన నివాళులు



దేశం పరిరక్షణ కోసం విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కోసం ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 నుంచి వారం రోజులు పాటు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తాం. ఈ వారం రోజులు జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, అవగాహన సమావేశాలు, వ్యాస రచన పోటీలు, సాయుధ బలగాలపై అవగాహన, ప్రదర్శనలు, పోలీస్ అమరవీరుల కుటుంబాలకు పరామర్శ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– కె.ప్రతాప శివకిషోర్, జిల్లా ఎస్పీ

పోలీసు సిబ్బంది సేవలు ఆదర్శనీయం



దేశం కోసం ప్రాణాలర్పించిన పోలీసులు త్యాగం చిరస్మరణీయం. వారి అంకితభావం పోలీసు సిబ్బందికి ఆదర్శనీయం. అమరవీరుల ఆత్మార్పణ, పోలీసులతో పాటు భారతీయులందరికీ స్ఫూర్తిదాయకం. చరిత్ర ఉన్నంతకాలం పోలీసు అమరుల త్యాగనిరతి ప్రశంసలందుకుంటుంది.

– ఎం.వీ సుభాష్, సీఐ, గణపవరం

అమరవీరుల తల్లులందరికీ వందనం



దేశం కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసులు, వారి కన్న తల్లులందరికీ వందనం. గొప్పయోధులకు జన్మనిచ్చి భారతదేశ పోలీసుల త్యాగనిరతిని ఇనుమడింప చేసేలా పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులు ప్రశంసనీయులు. కీర్తిప్రతిష్టలు, పోలీసు అమరవీరుల తల్లిదండ్రులందరికీ దక్కుతాయి.

– క్రాంతిప్రియ, దిశా పోలీస్ స్టేషన్ ఎస్సై

పోలీస్ డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ



రామారావుగూడెం పోలీస్ డాగ్‌తో తనిఖీ చేస్తున్న దృశ్యం

దెందులూరు: రామారావుగూడెం రైస్‌మిల్లు బాత్‌రూమ్‌లో శనివారం రాత్రి ఓ వ్యక్తి (50) మృతదేహాన్ని పోలీసులు కనుగొన్న సంగతి విదితమే. దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ కథనం ప్రకారం తణుకు మండలం ఉండ్రాజవరం గ్రామానికి చెందిన తూము రాంబాబు గోనె సంచులు కుట్టు పని చేస్తుంటాడు. మిల్లులోని బాత్‌రూమ్‌లో రాంబాబు మృతి చెందాడని మిల్లు యజమాని ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించినట్టు ఎస్సై తెలిపారు. ఆదివారం ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్‌తో రైస్‌మిల్లు, బయట రోడ్డు, లోపలి భాగం, చుట్టుపక్కల ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. మృతుడితో పాటు అక్కడ ఉండే వారందరి వేలిముద్రలు నమోదు చేశారు. మృతుని తల్లి, అన్న, కుటుంబ సభ్యులతో మాట్లాడి అతడి ఆరోగ్య పరిస్థితి, జీవన విధానం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు

గణపవరం: జల్లికొమ్మర యూపీ స్కూల్లో చదువుతున్న 150 మంది విద్యార్థులకు గణపవరం శ్రీదుర్గా డయగ్నోస్టిక్ ఆధ్వర్యంలో ఉచితంగా రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆ రిపోర్టులను టెక్నీషియన్ నీలపాల శ్రీనివాసరావు వారి తల్లిదండ్రులకు అందించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల హెచ్ఎం సుందరకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధార్ కార్డు మాదిరిగా విద్యార్థులకు ఆపార్ కార్డు అందిస్తుందని, ఈ కార్డు కోసం బ్లడ్ గ్రూప్ వివరాలు ఆన్‌లైన్ చెస్తామన్నారు. రక్త పరీక్షలు ఉచితంగా చేయడానికి డయాగ్నోస్టిక్ నిర్వాహకులు ముందుకు వచ్చారన్నారు. జల్లికొమ్మర సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం, సీహెచ్ లీలాగోపాల్, ఎల్.ప్రసాదరావు పాల్గొన్నారు.

రహదారి ఛిద్రం.. ప్రయాణికుల అవస్థలు





బాదంపూడి వద్ద ఛిద్రమైన రహదారి గోతుల్లోకి చేరిన వర్షం నీరు

ఉంగుటూరు: జాతీయ రహదారి ఛిద్రమై ఏర్పడిన గోతుల్లో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరి చెరువును తలపిస్తున్నాయి. ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి గోతులమయంగా మారింది. ప్రధానంగా బాదంపూడి వంతెన మలుపులో పడిన గోతుల్లో వర్షం నీరు చేరడంతో ప్రమాదకరంగా మారాయి. గోతులను దాటుకుంటూ వాహనాలను నడపడం వాహన చోదకులకు సాహసంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రహదారి మరింత దారుణంగా తయారైంది. గతంలో జాతీయ రహదారిగా ఉన్న ఈ రోడ్డు బాదంపూడి నుంచి ప్రత్తిపాడు వరకు రాష్ట్ర ఆర్‌అండ్‌బీ రహదార్ల పరిధిలోకి చేరింది. ఈ రహదారి ఆలనా పాలనా తాడేపల్లిగూడెం ఆర్‌అండ్‌బీ అధికార్లు చూడాల్సి ఉంది. కాని వారు పట్టించుకున్న దాఖలాలు కనపడటం లేదు. ఎంతోమంది ద్విచక్ర వాహనాదార్లు ఈ రోడ్డుపై ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులుగా మారుతున్నారు. రాత్రి సమయంలో ఈరోడ్డుపై ప్రయాణం మరీ భయానకంగా మారిందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా గొయ్యి



చేబ్రోలు బ్రిడ్జి వద్ద ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

చేబ్రోలు బ్రిడ్జి వద్ద జాతీయ రహదారి ఆనుకుని భారీ గొయ్యి పడింది. కూత వేటు దూరంలో పోలీస్‌స్టేషన్ ఉంది. తల్లపురం ప్రజలు, నిత్యం చేబ్రోలు సెంటర్‌కు వస్తుంటారు. చేబ్రోలు రైతులు నిత్యం ఈ రోడ్డు మీదుగా పొలాల్లోకి వెళుతుంటారు. ద్విచక్ర వాహనదారులు ఈ గోతిలోపడి క్షతగాత్రులు అవుతున్నారు. కొందరు గొయ్యిని తప్పించబోయి జాతీయ రహదారిపై ప్రమాదాలకు గురవుతున్నారు. గొయ్యిని పూడ్చి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

రేపు భీమడోలులో ఉద్యోగ మేళా

భీమడోలు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు భీమడోలు వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు స్కిల్ డవలప్‌మెంట్ జిల్లా ఇన్‌చార్జి వాడపల్లి కిషోర్, ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ భీమడోలులో ఆదివారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 220 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఇన్నోవా షోర్స్, హెట్రో ల్యాబ్స్, బజాజ్ క్యాపిటల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు కలిగి 18 నుంచి 30 ఏళ్ల లోపుగల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

నేత్ర వైద్య శిబిరంలో 135 మందికి పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామకోటి ప్రాంగణంలో ఆదివారం లయన్స్ జిల్లా చైర్ పర్సన్ మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల బృందం ప్రతినిధులు ఉచితక నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఉషా గ్రూప్ సంస్థల చైర్మన్ వీవీ బాలకృష్ణా రావు ప్రారంభించారు. ఈ శిబిరంలో 135 మందికి ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 19 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని నిర్ధారించి వారిని వేమగిరి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మరో 36 మందికి కళ్లజోళ్లు సబ్సిడీ ధరలకు పంపిణీ చేశారు. లయన్స్ రీజియన్ చైర్మన్ ఉడతా రత్నకుమార్, బెల్లంకొండ మురళి, సుబ్రహ్మణ్యం, చెన్నా వెంకటరామయ్య, బొలిశెట్టి సురేష్ కుమార్, అల్లం వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు

ఉంగుటూరు: రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కౌలు చట్టం తీసుకువచ్చి కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు కోరారు. ఆదివారం కైకరంలోని తూర్పు వీధిలో కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 22న విజయవాడలో నిర్వహిస్తున్న జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని కోరారు. 22న ఉదయం 10 గంటలకు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ సదస్సు నిర్వహిస్తారన్నారు. కేరళ మంత్రి ఎంబీ రాజేష్, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, పలువురు వ్యవసాయ రంగం నిపుణులు పాల్గొంటారని వివరించారు. అన్ని పంటల రైతులు సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగ సమస్యలపై సదస్సులో చర్చిస్తారన్నారు.

లిడ్ క్యాప్‌నకు నిధులు మంజూరు చేయాలి

దెందులూరు: లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (లిడ్ క్యాప్)కు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ చర్మకారుల కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్రంలో ఏర్పాటు చేసిన లిడ్ క్యాప్ కార్పొరేషన్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిధులను జోడించాలన్నారు. రాష్ట్రంలో ఉన్న చర్మకారులు, డప్పు కళాకారుల అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి, మౌలిక వసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం లిడ్‌క్యాప్ చైర్మన్ కృషి చేయాలని కోరారు. చెప్పులు కుట్టే చర్మకారులు, లెదర్ వర్క్ చేసే కార్మికులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి హెల్త్‌కార్డులు అందజేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చర్మకారులు, డప్పుకళాకారులతో కలిసి వినతిపత్రాలను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని జిజ్జువరపు రవిప్రకాష్ అన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

భీమడోలు: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపర్చేందుకు ప్రభుత్వ కృషి చేస్తుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల ముగింపు రోజైన ఆదివారం భీమడోలు మండలంలోని పూళ్ల, వడ్లపట్ల, పోలసానిపల్లి, భీమడోలు గ్రామాల్లో రూ.3.08కోట్ల విలువ చేసే సీసీ రోడ్లు, మెటల్ రోడ్ల నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమాల్లో సర్పంచులు షేక్ రహీమాబేగం, దాయం సుజాత, ఏపూరి భానుదీపిక, జిల్లా నాయకులు వట్టి పవన్, మాజీ ఎంపీపీ ఎస్.కొండబాబు, ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్, పెద్దలు పుప్పాల హరీష్, ప్రత్తి మదన్ పాల్గొన్నారు.